# తప్పని తప్పని యుగళ గీతం

రంగారావ్

"సరోజా! సరోజా!" అంటూ వంటింట్లోకి పరుగెత్తుకొచ్చాడు శేషగిరి, చేతిలో పత్రికతో.

అదిరిపడి తిరిగిచూసింది వంట ప్రారంభిస్తున్న సరోజ. ఆ తిరగడంలో ఎడమచేతి వేళ్లు రెండు కుంపటికి తగిలాయి.

"అమ్మా" అంది సరోజ బాధతో వేళ్లను చూసుకుంటూ. శేషగిరి ఒక్క దూకులో సరోజ ప్రక్కకొచ్చి కూచుని, ఆమె వేళ్ళను తీసుకుని వాత్సల్యంతో ఊదసాగాడు. సరోజ కృతజ్ఞతతో అతణ్ణి చూసింది.

"అంత తొందరెందుకు సరోజా?" అన్నాడు శేషగిరి పాపాయిని ముందలిస్తున్నట్టు.

"మరి ..రాకెట్ లా దూసుకొచ్చి స్ఫుత్నిక్ లా 'సరోజా-సరోజా' అని అరుస్తూంటే, ఏం మునిగిపోయిందోనని..."

"ఆదివారప్పూట అర్ధాంగిని అనురాగంతో పిలవడంకూడా తప్పే?"

"పొద్దున్న ఎనిమిదింటికి, వంటింట్లో, బొగ్గులబస్తా-నూనెజాడీలమధ్య అనురాగా లేవిటి?"

"ప్చ్.. ఏం చేస్తాం!...అనుభవించగలిగే ఆ రసిక హృదయం వుండాలి గానీ...బొగ్గుల బస్తాలు మందారవృక్షపు మొగ్గలుకొల్పదా! నూనెజాడీయే రంగురంగుల కాంతిని ప్రకాశించదా!"

"మీరాఅఫీసు డ్రామాలోని హీరో డైలాగులు ఇలాగనుకుంటాను...కదూ?" అంది సరోజ చిన్న కంచుగంటలా నవ్వుతూ...

"సరోజా! నేనొకటి చెప్పనా?"

"ఏమిటది?"

"నీవు అట్లా నవ్వుతూంటే నాకు ఎంతో ముద్దొస్తుంది..."

"ఊఁ"

"నీనవ్వు వింటుంటే నక్షత్రాలు పరికిణీ కట్టుకొని, పూలు మాట్లాడుకుంటున్నట్లా వుంటుంది.."

"అబ్బా...! ఊఁ..."

"అతర్వాత...మరేమో...నా హృదయం, వలలోపడ్డ చేపలా గిలగిలలాడి-జావ అయిపోతుంది."

"పాపం!...ఆ హృదయ నిర్మాణంలో కాస్తా సిమెంటుపాళ్ళు తగ్గినట్టుంది..." అని సరోజ నవ్వాపుకోలేక అంటుంటే... శేషగిరి ఆమె జడపట్టి లాగాడు...

'అయితే ఇవాళ మనకు హోటలుభోజనమన్నమాట!" అంది సరోజ.

"ఏం? కోంపదీసి..."

"ఛీ.. అదేమీకాదు కానీ—పొద్దున్నే భర్తగారు వంటింటోకొచ్చి కూచుని అల్లరి చేసే.."

"అల్లరిపిల్లల చెరవుగా గిల్లికజ్జాలాడవుగా" అన్నాడు శేషగిరి సినిమాలోపాట గుర్తుకురాగా...

సరోజ, కుంపటిమీది గిన్నెలోని నీరంతా ఆవిరయిపోవడం చూచి.. మళీ నీళ్ళు పోసింది. కర్రిచీటా, కూరలబుట్టా తీసుకుంది. శేషగిరి కన్నార్పకుండా ఆమెప్రతి కదలికలోనూ ఒక కావ్యం పఠిస్తున్నాడు.

"ఇంతకూ శ్రీవారు ఇటు ప్రత్యక్షం కావడానికి కారణమేమిటో సెలవిచ్చారు కారు."

"అసలావూసే మరిచిపోయాను. ఏదీ... వేళ్లు కాలడం...నీవు నవ్వడం..."

"—మీరు నా జడపట్టి లాగడం ... కుంపటిమీది నీళ్ళు ఆవిరయిపోవడం..." అని అందిచ్చింది సరోజ.

"ఇత్యాదుల్లో పడి మరిచిపోయ్యాను ఇటొచ్చి నా ప్రక్క కూర్చో చెబుతా..."

"కుంపటి ఆర్పేసిరానా?"

"ఎందుకూ?"

"అనవసరంగా నీళ్ళు ఆవిరయి అయిపోవడం, నిప్పులు బూడిదయిపోవడం ......"

"ఆ ... ఏమీ ఫరవాలేదు లెద్దూ .. ఇలారా!" సరోజవచ్చి పద్మాసనం వేసుకూర్చుంది.

శేషగిరి సీరియస్ గా ప్రారంభించాడు.

"ఇది మనకు జీవన్మరణసమస్య.. కాకావారుల సంతతి కంతటికీ సంబంధించినసమస్య .. అనాదినుండీ తీరని సమస్య ... అమావాస్యలాటి సమస్య..."

"భర్తగారిస్వామీ! ఈ కొత్తవ్య ఉపోద్ఘాతమెందుకు... మా నేయిందిస్వామీ!"

"ష్! ప్రవాహానికి ఎదురీదకు ... మనం నేను చేయబోయేనిర్ణయం నీన్నూ, నన్నూ, మనల్నందరినీ - మనతర్వాత మన పాపాయిలనూ, వారి పాపాయిలనూ, పాపపాయిలనూ,.. అలాఅలా భవిష్యత్ మానవ సంతతినీ మార్చి వేస్తుంది. ప్రజలందరినీ ద్రవ్యకాయులుగా, ఆరోగ్యవంతులుగాచేసి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించగల బ్రహ్మాండమయిన పథకం..."

"అబ్బా, చాల పెద్దదే ఈ పథకం! అయితే ఇది వెనకవున్న మన తాతయ్య షగ్గరాలను ముట్టుకోదన్నమాట.."

"సరోజా ..అడురాకు ."

"అసలీ వ్యాకదంపుడు మానేసి విషయమేమిటో తేల్చండి. లేకపోతే లేచిపోతా ....."

"లేవడానికెందుకదా.. ఊపిరాడ్డానికూడా వీలులేదు...ఏం?"

"సరే..."

"ఇహ విను...నేనడగబోయే ప్రశ్నలకు జవాబులు తకీమని చెప్పాలి ... 'అవును' - 'కాదు' అని సమాధానంఇచ్చెయ్యాలి, అంతే! నానుడూ మింగుడూ, కూడదు."

"సరే"

"రోజూ నీవు బియ్యాన్ని బాగా నీళ్లలో కడుగుతావుకదూ మొదట?"

"అవును."

"అన్నం వుడికినతర్వాత గంజిని క్రింద పారబోస్తావుకదూ?"

"అవును."

"కాయగూరలన్నిటిని తరిగేటప్పుడు పైనవున్న తొక్కంతా తీసి పారేస్తావు కదూ?"

"అవును..."

"వాటిని బోలెడునీళ్లలోపడేసి ఏకంద డిగ్రీల సెంటిగ్రేడుదాకా వుడికిస్తావు

కదూ. ?"

"అవును"

"ఆ వుడికిన కూర ముక్కల్ని వడబోసి ఆనీళ్ళన్నీ క్రింద వంపేస్తావుకదూ?"

"అవును"

—"చూచావా? మనం ఎంత మూర్ఖులమో" అన్నాడు శేషగిరి నిట్టూర్పుతో.

"ఆ బహువచనంలోకి నేను రాను."

"మరి నీ వచనం అలాగుంది"

"అంటే?"

"అంటే బియ్యాన్ని నీళ్ళల్లో తోమి తోమి పొట్టంతా - కడిగి, ఉడికించి, గంజి పారబోసి .. ఆ మిగిలిన అన్నం మనం తింటున్నాం."

"'మిగిలిన' అన్నమేమిటే మీ చాదస్తం."

"చాదస్తం కాదు సరోజా, అజ్ఞానం! బంగారంలాంటి విటమిను 'బి'ని పోగొట్టుకుంటున్నాం.."

"పోనీ రేపట్నుంచీ ఆ బియ్యం కడిగిన నీళ్ళూ, ఆ గంజీ, అట్టే పెట్టుకుని అన్నం పారేద్దాం.."

"అల్లరి మానేయ్.. ఏం.. తర్వాతా... కూరలమీది తొక్కులో విటమిను 'సి' వుంది—కూరల్ని వుడికించడంతో వాటిలోని లవణాలు ధ్వంసమయిపోతున్నాయి."

"ఊఁ."

"విటమిన్లూ, లవణాలూ పిండేసిన తర్వాత దమ్మిడీకి కొరగాని పిప్పి మిగుల్తోంటే దాన్ని తింటున్నాం మనం..."

"ఓహో.. !"

"అంచేత రేపట్నుంచీ..."

"ఊఁ..."

"బియ్యాన్ని కడగకూడదు.. బియ్యం వుడకడానికి సరిపోయేంత నీళ్ళే పోయాలి. గంజి వార్చడమన్న వూసే రాకూడదు..."

"తర్వాత ."

"కాయగూరలు సాధ్యమయినంతవరకూ పచ్చివే తినడానికి ప్రయత్నించాలి"

"రామ రామ!"

"తొక్కు తీయకుండా తినగల్గితే మరీ శ్రేష్టం!"

"హూం..." అంది సరోజ...జీవితం



# ★ శ్రుతితప్పిన యుగళగీతం ★

మీద అలి వదులుకొన్నట్లు.

"అత్యవసర పరిస్థితుల్లో కొన్ని కూరలు తప్పిస్తే...మిగతావి వుడికించకూడదు."

"భగవంతుడు రక్షించుగాక!. మరి . ఈ జ్ఞానం ఇంత హఠాత్తుగా వుదయించడానికి కారణం?"

ఇవాళ పొద్దున్న పత్రికలో ఆ వ్యాసం చదివేదాకా మనం ఎంత వెర్రిపీనుగులమో తెలిసిందికాదు ఇహనయినా ఆ "వెర్రిని" వదిలించుకుని—"

"—ఉత్త "పీనుగు"ల మవుతామన్న మాట!" అంది సరోజ లేస్తూ

"పంజాబ్లలోనూ అక్కడా—వాళ్లసలు కూరల్ని వుడికించకుండానే తింటారట ఇంగ్లీషువాళ్ళూ చాలమట్టుకు అంతేనట అందుకనే వాళ్ళు బలంగా, చక్కటి అవయవపుష్టితో వుంటారు," అని శేషగిరి అంటుంటే సరోజ కొన వూపిరితో వున్న నిప్పుల్ని విసరసాగింది

"రేపట్నుంచీ మన ఇంట్లో క్రొత్తపద్ధతి భోజనం—" అని ప్రకటిస్తూ శేషగిరి లేచాడు.

* * *

సాయంకాలం. కాఫీ టిఫిన్ల అధ్యాయం ముగిసింది.. శేషగిరి ఏవో వుత్తరాలు రాసుకుంటున్నాడు సరోజ వచ్చి టేబిల్ మీద కూచుంది"

"ఏమండోయ్!"

"ఏమిటి?" అంటూ పెన్నూ కాగితాలూ తీసి డ్రాయరులో పడేశాడు శేషగిరి.

"మనం కొత్తబట్టలు కొనుక్కుందాం—అన్నారు..?"

"అవును."

"ఎప్పుడూ?"

"ఎప్పుడయినాసరే."

"ఓ చిన్న కోరిక!"

"మంజూరు చేసినట్టే—"

"పొద్దున్న చాకలాడు తెచ్చిన బట్టల్ని మీ పెట్టెలో పెడుతూ, మీ బట్టలన్నిటినీ తీసి చూశాను"

"అందులో తప్పేమీ లేదే?"

"అబ్బబ్బ! అడ్డురాకుండా చెప్పేది వినండీ—"

"అలాగే!" అన్నాడు శేషగిరి ఈజీ చెయిలో చేరగిలబడి కాళ్ళు సాచుకుంటూ

"మీ అన్ని దుస్తుల్లోనూ-ఒక్కటయినా సరిగా లేదంటే నమ్మండి"

"అంటే?"

"అంటే-ఒక్కటయినా కంటికింపుగా లేదూ అని. రంగు బాగుంటే కుట్టడం బాగులేదు కత్తిరింపు బావుంటే గుడ్డరంగు వెలిసిపోయివుంది"

"ఆ గోధుమరంగు సూటూ?"

"అది ఒక్కటే కాస్త ఫరవాలేదనుకోండి. అయినా రోజూ వేసుకునే బట్టలు ఒక్కటికూడా సహించగలిగినట్లు లేదు..."

"అబ్బా"

"మరి—మీరు రోజూ—వాటి నెలా వేసుకుంటున్నారో ఏమిటో—"

"ఏం?"

"అంత ఘోరంగా వున్నాయి మరి మీ ఆఫీసులో ఎవ్వరూ ఏమీ అనరూ?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? పంధొమ్మిది వందల నలభై నాటి కోట్లూ, ఇరవై నాటి చొక్కాలూ, భండాలమయిన రంగులూ."

"సరోజా! ఆగు ఆగు."

"ఆగడంకాదు. నా మాట వినండి..."

"ఆ పనే చేస్తున్నానుగా!"

"ఏం? ఇంచుమించు నా చీరలన్నీ మీరు కొన్నవే."

"తప్పకుండాను.." అన్నాడు శేషగిరి గర్వంతో, లేచి కూచుంటూ.

"అందుకనే మచ్చుకు ఒక్కటయినా మంచిది లేదు."

"హతోస్మి!" కూచున్న శేషగిరి వెనక్కు వాలిపోయాడు.

"బార్డరు బాగుంటే పంట మహా అన్యాయంగా వుంది రంగు బాగుంటే మా అమ్మమ్మ కాలపు బార్డరుతో వుంది"

"మరి మీ నాన్నగారు కొనిపెటిన చీరలో?"

"అన్నీనూ! ఆఖరుకు మన కిటికీ కర్టెన్లూ, టేబుల్ క్లాతూ, దిండు గలేబులూ కూడా ఈ నాటి తరహాలో—ఉండవలసిన రీతిలో లేవు" అని సమీక్షించింది సరోజ

"ఊం?" అన్నాడు శేషగిరి బలహీనంగా.

"అందుచేత మీకు నాకూ ఒక్కసెటు బట్టలూ, కర్టెన్లూ వగైరా కొనేద్దాం."

"డబ్బో?"

మొన్నటి పండుగ బోనసుందిగా... దాంతో చెరి నాలుగు కంటికింపయిన దుస్తులూ కొనుక్కుందాం"

"అలాగే చేద్దాం."

"అక్కడే వస్తుంది నా కోరిక. ఇన్నాళ్ళూ బట్టలూ అవీ మీరు తెస్తూంటే 'సరే సరే' అని వూరుకున్నాను. అంచేత ఆఖరుకు పరిస్థితి ఇంత అధ్వాన్నంగా తయారయింది"

"అన్యాయం అన్యాయం!" అని శేషగిరి ప్రతిఘటించాడు

"మీరు ఇంకో రెండు నిముషాలూరుకోండి ఆ తర్వాత మాట్లాడవచ్చు."

"ఆ తర్వాత మాట దాని కేముంటుంది?"

"మొదట వినండి ఇవాళో రేపో నేనే బజారుకెళ్ళి చక్కగా మన ఇద్దరికీ కావలసినబట్టలు పట్టుకొస్తా!"

"నీవు తేగలవా?"

"ఎందుకు తేలేనూ?-ప్రక్కింటి కాంత ఎప్పుడూ తనే తెచ్చుకుంటుంది."

"కాంత మొగుడికి బట్టలకొట్లులో ఎప్పుడూ మూడువందల అప్పుంటుంది తెలుసా?"

"నే నలా చేస్తానని భయపడకండి. ఉన్న డబ్బులో పట్టుకొస్తా.."

"ఉన్నట్టుండి ఇలా"

"తెలివి రావడానికి సమయమేమిటి? మధ్యాహ్నం పడుకుని ఆ పత్రికలో ఆ రంగులూ ఆ కొత్త కొత్త కత్తిరింపులూ చూస్తుంటే తెలిసింది—మనం ఎంత వెనక పడి వున్నామో?"

"ఇహ, ముందుపడతామన్న మాట!"

"ఖచ్చితంగానూ!" అని సరోజ అంటుంటే శేషగిరి "వందరూపాయలూ సెలవు" అనుకున్నాడు మనసులో.

* * *

మరుసటిరోజు పొద్దున్న—



సుఖ జీవిత సేవ

భారత "సిద్ధ వైద్య మహిమ" మన దేశ సిద్ధుల సాటిలేని కీర్తికి ఒక తార్కాణము.

"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతి గాంచిన మేహ, కుష్ఠురోగనివారిణి భయంకరమైన మేహ వ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి మేహరోగ నివారణ సూత్ర, లేహ్యము.

డా॥ కే. టి. కృష్ణమూర్తి ఆచారి & సన్సు,

5/22, మేల్ మాయిల్ (P O.) (N A Dt ) S India

"ఆఫీసుకు టయిమయినట్లుంది భోజనానికి లేవరూ?"

"అప్పుడే వంటయిందీ?"

"ఇవాళ అరఘంటలో అయిపోయింది వంట"

"ఓహో. కొత్తపద్ధతికదూ భేష్"

భోజనానికి కూచున్నాడు శేషగిరి వడ్డించ నారంభించింది సరోజ

"వాల్వ్ చేశావేం? ఇవాళ ఏదయినా పండగేంటి?" అన్నాడు శేషగిరి కంచంలో పొగలు కక్కుతున్న గోధుమరంగు ముద్దను చూసి

అబ్బే. అది అన్నమే బియ్యం కడక్కుండా, గంజి వార్చకుండా వండాను."

"మరిలా తయారయిందేం?"

"ఈ బియ్యంలో 'బి' విటమిను ఎక్కువ కాబోలు" అంది సరోజ

"మొదటి ప్రయత్నం కదూ... అలాగే వుంటుంది"

సరోజ కూరను వడ్డించింది. అన్నమూ కూరాకలిపి మొదటిముద్ద నోట్లో పెట్టుకున్నాడు శేషగిరి మొహం మారిపోయింది ఆముద్ద కాస్తా బయటికొచ్చింది

"ఇదేంకూరా?" అని అడిగాడు శేషగిరి కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా

"కాకరకాయ"

"ఇలావుందేం?"

"ముక్కల్ని వుడికించలేదు ఇంత ఉల్లిపాయముక్కలు కలిపి, పోపు వేసి పెట్టాను"

"ఓహో! మనకీ పచ్చికూరలు మెల్లిగా అలవాటు కావాలి."

"అవును అందుకనే లవణాలూ అవి పోకుండా"

"ఠీక్ హై ఏదీ అపులునిలా రానీ!"

పులుసును రానిచ్చింది సరోజ.

"పులుసులో ఈ బంతు లేవిటీ?"

"వంకాయలు! తరిగితే 'సి' విటమిను ఏమయిపోతుందోనని"

—మజ్జిగఅన్నం తినిలేచాడు శేషగిరి

* * *

ఆరోజు సాయంకాలం ఆఫీసు నుండి వచ్చాడు శేషగిరి కాఫీ ఇచ్చింది సరోజ.

కాస్సేపాగి "నేనూ, కాంతా, ఇందాక బజారువెళ్ళి వచ్చాం" అంది సరోజ

"ఎందుకూ?" అన్నాడు శేషగిరి

"ఎందుకేవిటి? నిన్న చెప్పానుగా"

"ఓహో అదా? అయితే బట్టలు కొనుక్కొచ్చావన్నమాట—"

"మరీ—" అంది సరోజ లోపలినుంచి నాలుగయిదు పేకెట్లుపట్టుకొనూ. వాటిని శేషగిరిముందు పడేసింది ఒకొక్కటే విప్పి శేషగిరిచేతి కివ్వసాగింది

"ఇది బహుశా 'నో ర క్ట రి న్'— కాబోలు" అన్నాడు శేషగిరి ఆ బట్టను విప్పి చూస్తూ

"ఛంపేశారు! అది కొత్త ఫాషన్‌లో వెడల్పు బార్డరు రేయన్ చీర!"

"ఈ పరుపుగుడ్డ మాత్రం అద్భుతంగా వుంది! నన్ను నిలువునా కోసినా ఇలాటిది తేలేను" అని ఒప్పుకున్నాడు శేషగిరి

"అదిపరుపుగుడ్డ కాదు మీకు చొక్కాల కని పట్టుకొచ్చాను" అంది సరోజ ముక్తసరిగా

"అయినా దుప్పట్లు ఇంత చిన్న గళ్ళవి తెచ్చావేం"?

"అంత వ్యంగ్యం అక్కర్లేదు. అది మీ పంట్లాని కని తెలియదు కాబోలు"

"ఊ ఇంకా చూపించు. ఏదీ ఆ! ఈ టేబిల్ క్లాత్ దివ్యంగా వుంది"

"అది చోళీ గుడ్డ!" అంది సరోజ కఠినంగా

అయిదు నిముషాలు నిశ్శబ్దం. సరోజ కళ్ళలో సందేహం శేషగిరి కళ్ళలో విషాదం

"మొత్తం ఎంత ఖర్చయింది?" అన్నాడు శేషగిరి

"ఎనభై నాలుగు రూపాయలు!"

"పోతే పోనీలే—బోనసు వచ్చేగా—"

"అంటే?" అంది—అభిమానంతో సరోజ

"నీవు తెచ్చిన చీర ఒక్క వురుకు తరువాత పోగులు చేతికి రాక తప్పదు"

"మీ షర్టింగో?"

"అది తొడుక్కుంటే—నేను ఆడో, మగో, నాకే తెలీదు"

"మీ పేంటు గుడ్డ బావులేదూ?"

"పేంట్లకి అంత పల్చటి గుడ్డ పనికిరాదు"

"మరి నా చోళీ గుడ్డ కూడా అంతే నంటారా?"

"ఆచోళీ తొడుక్కుంటే నీ వీపు టేబిల్‌లా వుంటుంది కానీ.."

"చాలు చాలు." సరోజ కంఠం రుద్ధమయింది

* * *

ఆ రాత్రి చాలసేపయింది.

ఇద్దరూ పడకలమీద పొర్లుతున్నారు నిద్రరావడంలేదు.

"సరోజా!"

"ఏమండీ?"

"రేపట్నుండీ నీవు వంట ఎప్పటిలాగే చెయ్యి"

"ఊ మరీ మరి"

"ఏమిటి?"

"ఇహముందు బట్టలూ అవీ మీరే కొనుక్కురండీ"

"అలాగే!" ★



వ్యవసాయ శాఖోద్యోగుల వన!